క్లుప్తంగా

పురస్కార గ్రహీతలకు సత్కారం



కవులు నరసింహమూర్తి, సత్యనారాయణలను సత్కరిస్తున్న రవిశంకర్ తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల గౌరవ డాక్టరేట్ పురస్కారాలు అందుకున్న పట్టణానికి చెందిన కవులు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణలను స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పాఠకుల సంఘం అధ్యక్షుడు చిక్కాల రవిశంకర్, గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మలు ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పల్లి భీమశంకరం, నందుల ప్రసాద్, నామాడి మహేష్‌బాబు, భీమవరపు మురళీకృష్ణ, జల్లి శ్రీనివాస్, నంబూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



మునిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న రామచంద్రరావు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు అన్నారు. మండలంలోని మునిపల్లి గ్రామంలో వలంటీర్లతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు



గొల్లవిల్లిలో కోలాటం ప్రదర్శిస్తున్న బాలికలు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాల్లో బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆదివారం ఆలయ ఆవరణలో విద్యార్థినులు చేస్తున్న కోలాటాలు, భరత నాట్య నృత్యాలు చూడటానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలు నూకరత్నానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన బాధితురాలికి కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కురసాంపేటకు చెందిన బాధితురాలు వాడ్రేవు నూకరత్నానికి రూ.20 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను, నిత్యావసర సరకులను ఆర్ఏఓ మునిస్వామి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి ఎంఎ అలీమ్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.వలీబాషా, పవన్, ప్రవీణ్, జిలానీ, కామరాజు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే వర్ధంతి

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కమినిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు మంజీరా

ముమ్మిడివరం: స్థానిక మంజీరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని కమిని, పొట్టితిప్ప, సలాది వారిపాలెం, కొత్తలంక, శేరుల్లంక గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డా.మంజీరా ఆధ్వర్యంలో వైద్యులు సుమారు 150 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది సీత, రామచంద్రరావు, సర్పంచ్ కొండేపూడి భద్రరావు, గెద్దం శేఖర్, కొండేపూడి భవానీ, బీర చిన్నారావు, కొండేపూడి నాగేశ్వరరావు, నేరేడిమిల్లి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

పదికి పదే లక్ష్యం

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

అమలాపురం రూరల్: విద్యార్థి దశలో పదోతరగతి పరీక్షలు ఎంతో కీలకం. ఉన్నత చదువులు, జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అందుకే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకూ ఇది పరీక్ష సమయమే. ఈ క్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను ముందుకు నడిపించేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోను మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు, ఫర్నిచర్ సరిపడినంతగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా

పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకూ జరగనున్నాయి. అమలాపురం నియోజకవర్గం పరిధిలో అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల పరిధిలో 34 ఉన్నత పాఠశాలలున్నాయి. మొత్తంగా 3,300 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. వారి కోసం 17 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు సైతం ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులు రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికి అన్ని సబ్జెక్టులపై మంచి అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తున్నారు. ఎప్పటికప్పుడు నమూనా పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి చదివిస్తున్నారు. పదికి పది

పదో తరగతి పరీక్ష రాయనున్న విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పరీక్షకేంద్రాలు
అమలాపురం	16	2083	11
అల్లవరం	11	631	3
ఉప్పలగుప్తం	7	586	3
మొత్తం	34	3300	17

జీపీఏ సాధించే దిశగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రణాళికతో ముందుకు

పదో తరగతి పరీక్షలకు మరో వారం రోజులే గడువున్న నేపథ్యంలో విద్యార్థులు ఇప్పటివరకూ చదువుకున్న పాఠాలను రివిజన్ చేసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు. సందేహాలుంటే ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని, కష్టంగా ఉన్న సబ్జెక్టులను వేకువజామున చదివితే మంచి ఫలితముంటుందని సూచిస్తున్నారు. అలాగే పాత ప్రశ్నా పత్రాలను సాధన చేస్తే పబ్లిక్ పరీక్ష రాయడం సులువవుతుందని చెబుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు సినిమాలు, టీవీలకు పూర్తిగా స్వస్తి పలకాల్సిన సమయమిదని గుర్తు చేస్తున్నారు.



ఇందుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

రోజూ ప్రత్యేక తరగతులు



సమ్మెటివ్-1లో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నూరు శాతం ఫలితాల సాధనకు తగిన ప్రణాళికను అమలు చేస్తున్నాం

– విత్తనాల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, ఇందుపల్లి

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



జిల్లా విద్యాశాఖ ఇచ్చిన రోజు వారీ ప్రణాళికను అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు నమూనా పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈఓ, అమలాపురం

పండ్లు, బిస్కెట్ల పంపిణీ



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంచిపెడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులు, లూయీ అంధుల పాఠశాల, హరి మనో వికాస కేంద్రం విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకులు, శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి చేతుల మీదుగానే వితరణ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, రాష్ట్ర శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ పిల్లి సుబ్రహ్మణ్యం, మహానాడు ఉభయ తెలుగు రాష్ట్రాల యువజన విభాగం అధ్యక్షుడు గుత్తుల శ్రీను, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దండుమేను సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణకు సత్కారం



ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను సత్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

తాళ్లరేవు: కష్టాలలో ఉన్నవారికి తన వంతు సాయం అందిస్తున్న ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను ఆదివారం సుంకరపాలెం బైపాస్‌లోని కాపు కల్యాణ మండపంలో ప్రజాసంఘాల ప్రతినిధులు గజమాలతో సత్కరించారు. శివన్నారాయణ కోవిడ్ సమయంలో చేసిన సేవలతో పాటు బాధిత కుటుంబాలకు అందించిన సహాయ సహకారాలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ రాజకీయాలు తాత్కాలికమని సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతికోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ కిరణ్‌కుమారి, ప్రజాసంఘాల ప్రతినిధులు పెయ్యల రమేష్, వడ్డి ఏడుకొండలు, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, కమిడి ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



పాఠశాల భవనానికి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో సీహెచ్ గున్నేపల్లి పంచాయతీ పరిధిలోని దేవరపల్లిలో రూ.16 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య అందించేందుకు అనేక పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జీ, దొమ్మేటి అప్పారావు, ఎంపీటీసీ గొలకోటి హనుమ పద్మజ, గొలకోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైస్ ఎంపీపీ బాలకృష్ణ తదితరులు

అమలాపురం రూరల్: గ్రామాల్లో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలమూరి బాలకృష్ణ అన్నారు. మండలంలోని గున్నేపల్లి అగ్రహారంలో వలంటీర్లతో కలసి ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. 58 నెలల్లో ప్రజలకు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి లేఖలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగాబత్తుల కొండ, కేతా సాయిబాబా, గోసంగి గృపాలకృష్ణ, పులిదండి సత్యనారాయణ, నాగాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి



కందికుప్పలో మంచి నీటి ప్రాజెక్టు రాపిడ్ శాండ్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

కాట్రేనికోన: గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో దొంతికుర్రులో నిర్మించిన వాటర్ ట్యాంకు, కందికుప్ప సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లో రాపిడ్ శాండ్ ఫిల్టరు, తిమ్మాపురంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటరును ఆదివారం ఆయన ప్రారంభించారు. కొప్పిగుంట సీతమ్మ చెరువు వద్ద ఇంటింటికీ కుళాయి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సైతం ఇంటింటికీ రక్షిత మంచి నీరు అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, చల్లగల్ల వెంకట లక్ష్మి, గిడ్డి ఈశ్వరి, ఏడిది చక్రపాణిరావు, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, నాతి సత్యనారాయణ, ఏడిది సుబ్బు, నల్లా బేబి జానకి, నాగరత్నం పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు



యానాంలో కొలువైన వేంకటేశ్వరస్వామి

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 11న సర్ప వాహనం, 12న శేష వాహనం, 13న పుష్ప వాహనం, 14న అశ్వ వాహనం, 15న సూర్య వాహనం, 16న గజ వాహనం, 17న పంచముఖ ఆంజనేయ వాహనం, 18న సింహ వాహనం, 19న హంస వాహనం, 20న గరుడ వాహనం, 21న కల్యాణోత్సవం, 22న పొన్న వాహనం, 23న రథోత్సవం, 24న చక్రస్నానం, తెప్పోత్సవం, 25 నుంచి 27 వరకు శ్రీ పుష్పయాగాలు, 29 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ కొతాయి ఉత్సవాలు నిర్వహించనున్నట్లుగా కల్యాణోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 21వ తేదీన జరగనున్న కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, లక్ష్మీ స్నేహ దంపతులు పాల్గొంటారన్నారు.

అమలాపురం తహసీల్దార్‌గా కనకరాజు



నూతన తహసీల్దార్ కనకరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం మండల తహసీల్దార్‌గా జి.కనకరాజు ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ని రెవెన్యూ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకూ రాజమండ్రిలో పనిచేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా అమలాపురం మండల తహసీల్దార్‌గా వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన పరమట శ్రీపల్లవి కృష్ణా జిల్లా పామర్రు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లాక ఎవరూ రాకపోవడంతో గత నెల రోజులుగా ఉప తహసీల్దార్ అడపా సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. ఎట్టకేలకు కనకరాజు వచ్చి పూర్తి స్థాయి బాధ్యతలు తీసుకున్నారు.

260 మందికి కంటి వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన వద్ద గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) అమలాపురం శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు 260 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధి మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, ఆకొండి చాణక్య, చాంబర్ ప్రతినిధులు సీహెచ్ సుస్మిత, బి.నిహారిక, మాకిరెడ్డి శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

తాళ్లరేవు: స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు అద్దేపల్లి సుధ, ప్రతినిధులు గోకవరపు శ్రీదేవి, సరిత, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక ఎంప్లాయీస్ హోమ్‌లో యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం జరిగింది. జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షురాలు గరగ సీతాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించే స్థాయికి మహిళా లోకం చైతన్యవంతం కావాలని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మహిళా ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలిగితే ఎస్టీయూ వెన్నంటి ఉంటుందని ఎస్టీయూ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పాతం శెట్టి దొరబాబు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు పి.హిమబిందు, సరిదే సత్యనారాయణ, వి.రత్నకుమారి, గంగాభవానీ, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: జగన్ ప్రభుత్వంలోనే మహిళలకు రాజకీయ గుర్తింపు లభించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. అమలాపురం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), మీనాక్షి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం జరిగిన మహిళా దినోత్సవంలో సత్యనాగేంద్రమణి పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పలువురు మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మహిళలకు లబ్ధి చేకూర్చడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు దివంగత కుడుపూడి చిట్టబ్బాయి సతీమణి కుడుపూడి అరుణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్వకొలను చాయాదేవి, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శులు పెయ్యల సంధ్య, దిట్టకవి అమ్మాజీ, కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, దొంగ నాగ సుధారాణి, పడాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు మట్టపర్తి శివ పార్వతి, సంసాని శ్యామలాదేవి, గొవ్వాల శ్రీదేవి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాపు చిత్రకళా పురస్కారాలు



సినీనటుడు హరీష్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని

యానాం: ప్రముఖ దర్శకుడు బాపు 90వ జయంతిని పురస్కరించుకుని స్థానిక కళానిలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన వేడుకల్లో యానాం రీజెన్సీ స్కూల్‌కు చెందిన 16 మంది విద్యార్థులు బాపు చిత్రకళా పురస్కారాలు అందుకున్నారు. సినీనటుడు హరీష్, డీసీపీ సుంకర సత్యనారాయణల చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నవారిలో మౌనిక, మాలతి, షర్మిల పావని, రాజ్‌కుమార్, లాస్యశ్రీ, కమలిని, లలిత, తనిష్క, యశస్విని, జెస్సీమిలన్, ఫణిశ్రీ, కీర్తన, నవాజ్, రోహిత, శరణ్య, నిహితానాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం టీవీఎస్ఎస్వీ ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు.

పుదుచ్చేరికి సర్కార్ ఎక్స్‌ప్రెస్

యానాం: కాకినాడ–చెన్నై వరకూ నడుస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకూ పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 17652, 17651 నెంబర్లు గల రైళ్లు కాకినాడ నుంచి పుదుచ్చేరికి ఆదివారం, బుధవారం, గురువారాల్లో నడుస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా రోజుల్లో నిర్దేశించిన రైలు కాకినాడలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు పుదుచ్చేరి చేరుకుంటుందన్నారు. దీనివల్ల పుదుచ్చేరి వెళ్లేందుకు మార్గం మరింత సుగమమైందని యానాం నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో రూ.2.81 కోట్ల ఖర్చుతో చేపట్టిన 19 సీసీ రోడ్లు, డ్రెయిన్లకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్‌లు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. కావున ఈ అభివృద్ధి పనుల శ్రీకారానికి మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిందితులను శిక్షించాలి



అమలాపురంలో నిరసన తెలుపుతున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

అమలాపురం టౌన్: విశాఖ జిల్లా మధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయిని కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ అమలాపురం పట్టణ, మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు పట్టణ సీఐ క్రిస్టోఫర్‌కు ఆదివారం ఉదయం విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు నిరసన తెలిపారు. ఫొటోగ్రాఫర్ సాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఖ్యాజాబాబు, అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి తాతాజీ, కోశాధికారి నాగేంద్ర, ఉపాధ్యక్షుడు పొట్టుపోతు నాగు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కె.రమణ ప్రసాద్, ఉషాకిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ విజేత షహీరాకు సత్కారం

అమలాపురం టౌన్: ఇటీవల పూణేలో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకాన్ని కైవసం చేసుకున్న స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యురాలు మెహబూబ్ షహీరాను స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. షహీరా 70 ఏళ్ల విభాగంలో హైజంప్ క్రీడా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రజత పతకాన్ని గెలిచారు. ఈ సందర్భంగా ఆమెను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పారుపూడి కృష్ణ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, అసోసియేట్ అధ్యక్షుడు సాయి వర ప్రసాదరావులు అభినందించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేలాయుధమ్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఏర్పాటుచేసుకోవడం ద్వారా ఆరోగ్యవంత సమాజం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎ.చంద్రశేఖరన్, ఎ.కరుణాగరన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యు.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మాస దీక్ష సూర్యారాధన



సూర్యారాధనలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న యాగకర్త గోపాలకృష్ణ

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లిలో నెలరోజులుగా జరుగుతున్న నవమ వార్షిక మాస దీక్ష సూర్యారాధన ఆదివారంతో ముగిసింది. యాగకర్త గొర్తి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోజూ సాయంత్రం నాద నీరాజనం, శ్రీచక్రార్చన, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఆదివారం జరిగిన పూర్ణాహుతిలో వేలాదిగా భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిగింది.